కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

116 మందికి రూ.1.16 కోట్ల విలువగల చెక్కులు అందజేత

అంబర్‌పేట తాసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, ఫిబ్రవరి 24 : ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట మండల తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాసీల్దార్ వీరాబాయి, కార్పొరేటర్లు బి. పద్మా వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, వై. అమృత తదితరులతో కలసి 116 మందికి రూ.1.16 కోట్ల విలువగల కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ తాసీల్దార్ సయ్యద్‌హజీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

గోల్నాక, ఫిబ్రవరి 24 : వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి, ఉమారమేశ్‌యాదవ్ తదితరులతో కలసి ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలతో పాటు రహదారులపై వ్యర్థాలు పేరుకు పోకుండా ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూనే ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. స్వచ్ఛ అంబర్ పేట నియోజకవర్గమే లక్ష్యంగా పని చేయాలని ఆయన పారిశుధ్య విభాగం అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో జ్యోతిబాయి, రాంకీ సంస్థ ప్రతినిధి దేవేందర్ పాల్గొన్నారు.

అంబర్ పేట మున్సిపల్ మైదానంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

ఆసిఫ్‌నగర్ డివిజన్ దాయీబాగ్ హనుమాన్ బాలాజీ ఆవరణలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని అభిషేకం, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. గురుస్వామి మధుసూదన్, స్థానిక నాయకులు దిడ్డి పెంటయ్య పాల్గొన్నారు.

–ఆబిడ్స్ ఫిబ్రవరి 24

27న జర్నలిస్ట్స్.. హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

కాచిగూడ, ఫిబ్రవరి 24: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారులు హాజరవుతారని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఈ హౌసింగ్ సొసైటీ సమావేశానికి హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 : భారతదేశంలో అంబేద్కరిజంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా అన్ని స్వరాలు ఏకం కావాలని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంబేద్కరిజంపై దాడి .. ప్రజా స్వామ్యవాదుల కర్తవ్యం అనే అంశంపై ప్రజా స్వామ్యవాదులు, దళిత బహుజన సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ ఘంట చక్రపాని, సమావేశం సమన్వయ కర్త గడ్డం విజయరావు, జాతీయ కన్వీనర్ పి.శంకర్, కవి డాక్టర్ పసునూరి రవీందర్, డీబీఎస్ ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తదితరులు హాజరై ప్రసంగించారు. ప్రముఖ కవి, గాయకుడు జయరాజ్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, చేతన్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు టీచర్లు కృషి చేయాలి

విజ్ఞాన్ మోడల్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 24 : టీచర్లు విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరం కృషి చేయాలని మాజీ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. శనివారం ఛత్రినాక అయోధ్యనగర్‌లో విజ్ఞాన్ మోడల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ జి.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డిని సన్మానించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల కాలంలో విద్యార్థుల చదువుల కోసం ఎంతో చేశామన్నారు. కరస్పాండెంట్ పుల్లారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా గౌలిపురకు చెందిన వెంకటేశ్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్.. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

–చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 24

బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెన్న ఈశ్వరప్పు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె. లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్ సమక్షంలో నియామక పత్రాన్ని శనివారం ఈశ్వరప్పుకు అందజేశారు.

–తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 24

శ్రీ కనకాల కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు

హోమంలో పాల్గొన్న భక్తులు

కవాడిగూడ, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గోల్కొండ గౌతమ్‌కుమార్‌పటేల్, కార్యనిర్వాహణాధికారి సాంబశివరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై హోమంలో పాల్గొని పూజలు చేశారు.

కత్తులతో యువకుడిపై దాడి.. ఐదుగురి అరెస్ట్

అబిడ్స్,ఫిబ్రవరి 24 : యువకుడిపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఐదుగురు నిందితులను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేసి వారినుంచి మూడు కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. టప్పాచబుత్ర కుమ్మర్‌వాడీకి చెందిన నిఖిల్ కుమార్(23) తన స్నేహితుడైన పాతబస్తీ పేట్లబుర్జు నివాసి వినోద్‌గౌడ్ అలియాస్ లడ్డూ వద్ద రూ.80 వేలు అప్పుగా తీసుకుని రూ.60 వేలు తిరిగి చెల్లించాడు. మిగిలిన రూ.20 వేలకోసం వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో వినోద్‌గౌడ్ తన సోదరుడు శ్రీకాంత్, స్నేహితులు దీపక్, సోనూసింగ్, ఆకాశ్‌తో కలిసి ఈనెల 19 న నిఖిల్ కుమార్‌ను బలవంతంగా వాహనంపై అప్పర్ ధూల్‌పేట్‌లోని గంగాబౌలి కొండపై తీసుకెళ్లి కత్తులతో దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మంగళ్‌హాట్ పోలీసులు ఐదుగురు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై షేక్ అస్లాం కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

సంత్ సేవాలాల్ జీవితం స్ఫూర్తి దాయకం

వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 : సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం లంబాడితండా బస్తీలోని డబుల్‌బెడ్‌రూం భవనం వద్ద బంజారాల ఆరాధ్య దైవం సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు భూక్య సంజీవ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ హాజరై సంత్ సేవాలాల్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లంబాడీల అభివృద్ధి, సంక్షేమం కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని అన్నారు. లంబాడీతండాలను గ్రామ పంచాయితీలుగా గుర్తించి వారి సంక్షేమం అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భిక్షునాయక్, రఘురాం రాథోడ్, రేఖానాయక్, దేవేందర్‌నాయక్, హోబనాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కార్వాన్ నియోజకవర్గంలోని.. వివిధ డివిజన్లలో నివసించే 286 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ఎండీ నసీరుద్దీన్, స్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి నియోజకవర్గంలోని.. వివిధ డివిజన్లలో నివసించే 320 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్,కల్యాణ లక్ష్మీ చెక్కులను నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్‌ల ప్రతినిధులు జాఫర్‌ఖాన్, ఆరిఫ్ రిజ్వాన్, డాక్టర్ షేక్ ఖాసీం, ఎండీ.మూసా, సర్ఫరాజ్ సిద్ధికీ పాల్గొన్నారు. –మెహిదీపట్నం, ఫిబ్రవరి 24

దత్తాత్రేయనగర్ డివిజన్‌లో ఎమ్మెల్సీ పర్యటన

గోషామహల్ నియోజకవర్గం దత్తాత్రేయ నగర్ డివిజన్‌లో శనివారం ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్, స్థానిక కార్పొరేటర్ జాకీర్ బాక్రీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జిర్రా ప్రాంతంలో స్థానికులు ఎమ్మెల్సీకి నీటి సమస్యలపై ఫిర్యాదు చేశారు. నీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు.

–ఆబిడ్స్, ఫిబ్రవరి 24

సమస్యల పరిష్కారానికి కృషి

డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమా తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 24: రాజకీయాలకు అతీతంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. డివిజన్‌లోని నింబోలిఅడ్డా తదితర బస్తీలలో శనివారం పాదయాత్ర నిర్వహించి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని నీటి సమస్యను తీర్చేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, సుభాష్‌పటేల్, ఆర్.సంతోష్, భీంరాజ్, మల్లికార్జున్, రవియాదవ్ పాల్గొన్నారు.

రెడ్‌హిల్స్‌లో వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 24. నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని రెడ్‌హిల్స్ డివిజన్ బజార్‌ఘాట్ రోడ్డులోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం మండపంలో నూతనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఐదు రోజుల నుంచి నిర్వహించిన పూజా కార్యక్రమాలలో భాగంగా నరసింహస్వామి హోమం, చండీ హోమం అనంతరం శనివారం ఉదయం సంగం మఠం స్వామీజీ రాహుల్‌బాబాదాస్ జీ యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రామ రాజు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, ఏసీపీ సంజయ్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక సభ్యులు ఆంజనేయులు, బాబూరావు, సన్నీ, యోగేశ్‌సింగ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

విజేత టీంకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ కృష్ణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24: నెట్‌బాల్ మెన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజి యెట్ నెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌ను కాచిగూడ జూనియర్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ పోటీల్లో అంబేద్కర్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజెస్ టోర్నమెంట్ కార్యదర్శి డాక్టర్ కృష్ణ హాజరై గెలుపొందిన టీంకు బహుమతిని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడలతో శారీరక వ్యాయామంతో పాటు మానసిక వికాసం లభిస్తుందని అన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. సోమేశ్వరరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ టి. శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలపై సదస్సు



మాసబ్‌ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ కళాశాలలో జంతు శాస్త్ర వి భాగం ఆధ్వర్యంలో శనివారం డార్విన్ పరిణామ క్రమం, ఆధునిక సమాజంలో పరిశోధనల ఫలితాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సీసీఎంబీ శాస్త్రవేత్త, సీడీఎఫ్‌డీ మాజీ డైరెక్టర్ డాక్టర్ కె. తంగరాజు మాట్లాడుతూ.. మనిషి జీవ పరిణామ క్రమంలో జరిగిన మార్పులు, అంతరించిన లక్షణాల గురించి కూలంకషంగా వివరించారు. జాతుల ఉత్పత్తి గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, హాస్టల్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మీనాక్షితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 24

విశ్రాంత తపాలా ఉద్యోగుల సమావేశం



డాక్ సదన్‌లో విశ్రాంతి తపాలా ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న సీనియర్ విశ్రాంత ఉద్యోగి డి.మల్లికార్జునరావు, పీవీ శాస్త్రి తదితరులు

అబిడ్స్, ఫిబ్రవరి 24: డాక్ సదన్‌లో విశ్రాంత తపాలా ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విశ్రాంత ఉద్యోగి డి. మల్లికార్జునరావును సన్మానించారు. నూతన కార్యవర్గంలో కన్వీనర్‌గా దిట్టకవి వెంకటరమణ, కోశాధికారిగా నెహ్రూలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పి. విశ్వేశ్వరశాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయకులు డోలా జవహర్‌బాబు, కన్వీనర్ పి. విశ్వేశ్వరశాస్త్రి, కవి వడ్డేపల్లి కృష్ణ, జీవీఎన్ రాజు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ, ఫిబ్రవరి 24: వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50) శనివారం సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై ఆకుపచ్చ, ఎరుపు రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.6 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం..

కవాడిగూడ, ఫిబ్రవరి 24: వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో అనిత రవికుమార్ దంపతులు ఉంటున్నారు. వీరికి 14 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. రవికుమార్ జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. అతని భార్య అనిత నాంపల్లి కోర్టులో కాంట్రాక్ట్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది. రవికుమార్ తాగుడుకు బానిసై ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 24: మార్చి 1న ముషీరాబాద్ నియోజక వర్గంలో నిర్వహించే బీజేపీ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని నియోజక వర్గం ప్రచార కమిటీ కన్వీనర్ పూస రాజు, కో-కన్వీనర్ శేషాసాయి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ముషీరాబాద్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో విజయ సంకల్ప యాత్ర విజయవంతంపై ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయ సంకల్ప యాత్ర ప్రచార కమిటీ కన్వీనర్, కో- కన్వీనర్‌లుగా పూస రాజు, శేషసాయిలను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ నియమించినట్లు తెలిపారు. మార్చి 1న చేపట్టే విజయ సంకల్పయాత్రలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, రాష్ట్ర, నగర నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

ఓపీ బ్లాక్‌లోని మీకో వార్డును సందర్శించి నర్సులకు సూచనలను ఇస్తున్న ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, ఆర్ఎంవో డాక్టర్ రఫీ

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 24 : అనారోగ్య సమస్యలతో దవాఖానలో వైద్య చికిత్స పొందుతున్న పేద రోగులకు సకాలంలో వైద్య సేవలందిం చడంలో నిర్లక్ష్యంచేస్తే ఉపేక్షించేది లేదని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అన్నారు. శుక్రవారం ఆయన ఆర్‌ఎంవో డాక్టర్ రఫీతో కలిసి దవాఖానలోని పలు వార్డులను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పలు వార్డులలో విధి నిర్వాహణలో ఉండాల్సిన నర్సులు లేక పోవడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో లేని వైద్య సిబ్బందికి మెమోలను జారీ చేశారు. ప్రైవేట్ దవాఖానలలో వైద్యం చేయించుకోలేక సుదూర ప్రాంతాల నుంచి దవాఖానకు వచ్చిన రోగులతో దురుసుగా వ్యవహరి స్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇక మీదట రోగుల పట్ల అమర్యాదగా, దురుసుగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సైన్స్ ద్వారానే దేశాభివృద్ధి ..

సమావేశంలో అల్తాఫ్ హుస్సేన్ , ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24 : సైన్స్ ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లార్డ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అల్తాఫ్‌హుస్సేన్ హాజరై మాట్లాడుతూ.. వైద్యరంగంలో హాని చేసే మందులు నిషేధించినా మనదేశంలో అమ్ముతున్నారంటే ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేస్తున్నాయా? అని ప్రశ్నించారు. కవి రచయిత ఏనుగు నర్సింహారెడ్డి, రాధిక, విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేశ్, బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్. సోమయ్య పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

కాచిగూడ,ఫిబ్రవరి 24: ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీ విజయ్‌నగర్‌కాలనీకి చెందిన హర్ష్‌పూనియా(22) శుక్రవారం రాత్రి తాగిన మైకంలో డీఎల్ 2సీ ఏక్యూ 4747 నంబర్ గల కారులో కోరంటి దవాఖాన వైపునకు వెళ్తూ తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో వోమిని, టాలీ, ఇండికా కార్లను ఢీకొట్టి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి పోగా, కార్లకు తీవ్రమైన నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. వెంటనే పోలీసులు హర్ష్‌పూనియాను అదుపులోకి తీసుకుని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యూనిక్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు

అబిడ్స్, ఫిబ్రవరి 24: ఫెర్నాండేజ్ ఫౌండేషన్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో యూనిక్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ కోర్సును ప్రవేశ పెట్టినట్లు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్ పేర్కొన్నారు. వినూత్నమైన ఈ సర్టిఫికెట్ కోర్సులో చేరిన వారికి ఆరు నెలల శిక్షణ, ఆరు జననాలకు బర్త్ సపోర్ట్‌తో సహ కోర్సును పూర్తి చేసేందుకు రెండు సంవత్సరాల సమయం పడుతుందన్నారు. శిక్షణలో స్వయం పరిశీలన, ఈ-లెర్నింగ్ మా డ్యూల్స్, బర్త్ సపోర్ట్, ప్రత్యేక చర్చలతో పాటు నాలుగు శిశు జనన తరగతులను నిర్వహిస్తామన్నారు. కోర్సు నిర్మాణంలో ప్రధానంగా 45 గంటల ప్రత్యేక పఠనం, మెంటార్‌లతో 15 గంటల పాటు చర్చలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని అన్నారు. ఈ శిక్షణ ఫ్యాకల్టీలో ఫెర్నాండేజ్ హాస్పిటల్ హెడ్ పూజా షెనాయ్, సెలెస్టిని కావిందర్ ఉన్నారని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

27న మెగా జాబ్ ఫెయిర్

అబిడ్స్, ఫిబ్రవరి 24 : డెక్కన్ బ్లాస్టర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఎంఎన్‌సీ మెగా జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, డెక్కన్ బ్లాస్టర్స్ చైర్మన్ మన్నన్‌ఖాన్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొన వచ్చుని, ఉదయం 8 నుంచి 2 గంటల వరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8374 315052 నంబర్‌లో సంప్రదించాలి.

మహిళ మృతదేహం లభ్యం

కవాడిగూడ, ఫిబ్రవరి 24: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు దోమలగూడ పోలీసులు శనివారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరాపార్కు ప్రాంతంలో ఉదయం 10-30 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పార్కు ఎదురుగా ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉంది. వెంటనే 108 కి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న మహిళను పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. మృతురాలికి 45 ఏండ్ల వయస్సు ఉన్నదని, విచారించగా ఆమె భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు తేలిందని తెలిపారు. మృతురాలు నైటీ ధరించి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీలో భద్ర పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అందివచ్చిన అవశాలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 24 : అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆర్‌ఎస్‌టీ టెక్నాలజీస్ అండ్ ఓరియంటేషన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, డీయాజియో ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో 200 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదండరాం హాజరై వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఈవో రంజిత్‌కౌర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా నా క్లయింట్ రావిరాల నర్సయ్య తండ్రి ఆంజనేయులు R/o దిలుసుఖ్‌నగర్, హైదరాబాద్ గారి సూచనలను అనుసరించి ఈ క్రింది బహిరంగ ప్రకటన చేయుచున్నాను.

నా క్లయిట్ ఈ క్రింది షెడ్యూలు యందు గల ఇం.నం. 3-6-306 CP ఆఫీస్ ఎదురుగా గల ఇల్లును దాని యజమానులు అయిన 1, మిర్ అహ్మద్ అలీ ఖాన్ తండ్రి లేట్ మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్ 2. మిర్ యాసూఫ్ అలీ ఖాన్, తండ్రి లేట్ మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్, 3. మిర్ సదత్ అలీ ఖాన్, తండ్రి లేట్ మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్, 4. మిర్ అజ్మత్ అలీ ఖాన్, తండ్రి లేట్ మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్, 5. దుర్దనొన్నిస బెగుమ్, D/o లేట్ మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్, 6. నూజ్జుత్తున్నిస బేగమ్, D/o లేట్ మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్‌లు యజమానులుగా ఉన్నారు అట్టి ఇల్లు యజమానులు అందరు కలిసి హమీద్ అలీ ఖాన్ తండ్రి మిర్ ఇబ్రహీమ్ అలీ ఖాన్ అనే వారికి GPA యిచ్చి ఉన్నారని ఈ క్రింది షెడ్యూలు ఇల్లును అమ్మి బయానాగా కొన్ని డబ్బులు తీసుకున్నారు అయితే ఈ ఇల్లును నా క్లయింట్ కొనుగోలు చేశారు. విక్రయధనము కొంత ఇచ్చారు. ఈ ఇల్లుపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరమైనా ఉంటే ఈ బహిరంగ ప్రకటన ఇచ్చిన 7. రోజులలోపు తగిన ఆధారాలతో సంప్రదించగలరు లేనిచో ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించి రిజిస్ట్రేషన్ చేసుకోబడును.

షెడ్యూల్

హైదరాబాద్ టౌన్ హిమాయత్ నగర్ కాలనీ, బాహర్ హోటల్ ఎదురుగా, ఇం.నం. 3-6-306 యందు 4100 చదరపు గజముల స్థలం మరియు RCC, బిల్డింగ్ కలదు. సౌత్: మెయిన్ రోడ్ హిమాయత్‌నగర్ నుండి అశోక్ నగర్.

రాపోలు భాస్కర్, ఎం.ఎ.ఎల్ఎల్.బి. అడ్వకేట్

హైకోర్టు ఆఫ్ తెలంగాణ, ఇం.నం. 16-2-740/7, ప్లాట్ నం.7, గడ్డిన్నారం రోడ్డు, కళ్యాణ్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్. సెల్ నం. 9394642029, 9848498029